




హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గద్వాల నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు గులాబీ పార్టీలో చేరారు. వీరికి కేటీఆర్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల, శాట్ మాజీ చైర్మన్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఆంజనేయగౌడ్, నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బాసు హనుమంతు నాయుడు, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, కుర్వ విజయ్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



కేసీఆర్ కిట్‌లోని వస్తువులు


# కిట్.. ఫట్

## కేసీఆర్ కిట్టు.. నేడు కనిపిస్తే ఒట్టు

కేసీఆర్ కిట్‌కు ఆదరణ కరువైంది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కిట్ అందక బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన ఈ పథకం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కనుమరుగయ్యే పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు చేయించుకున్న మహిళలు కిట్ అందక వెతలు పడుతున్నారు.

**కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా..**

బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు కేసీఆర్ కిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేసింది. పుట్టబోయే శిశువు సంరక్షణ కోసం కిట్‌లో 16 రకాల వస్తువులను అందజేయడంతో కేసీఆర్ కిట్‌కు ఎంతో ఆదరణ లభించింది. ప్రభుత్వ దవాఖానలో డెలివరీ అయిన మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. దీంతో సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ఒకవైపు దవాఖానల్లో మెరుగైన సదుపాయాలను కల్పిస్తూనే మరో పక్క కేసీఆర్ కిట్‌తో పాటు ప్రోత్సాహకంగా కేసీఆర్ ప్రభుత్వం డబ్బులను అందజేసింది. మహిళలు గర్భం దాల్చిన తర్వాత గ్రామాల్లో, మున్సిపాలిటీల వార్డుల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణుల వివరాలు సేకరించేవారు. వారి ఆధార్, బ్యాంకు అకౌంట్ నెంబర్ తీసుకొని ఆన్‌లైన్ చేసేవారు. క్రమం తప్పకుండా ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షలు చేయించుకున్న మూడు చెకప్‌ల తర్వాత వారి అకౌంట్లలో రూ.3 వేలు జమ చేసేవారు. నెలలు నిండే వరకు బలవర్ధకమైన ఆహారం తీసుకునేందుకు రూ.5 వేలు అందించేవారు. అదేవిధంగా ప్రసవం తర్వాత బాలింత మంచి ఆహారం తీసుకునేందుకు ఆడ శిశువు పుడితే రూ.5 వేలు, మగ శిశువు పుడితే రూ.4 వేలు ఇచ్చేవారు. వీటితోపాటు పుట్టిన బిడ్డకు క్రమం తప్పకుండా బీసీజీ, ఇతర టీకాలు వేయిస్తే, 100 రోజులకు మరో రూ.2 వేలు, ఆ తర్వాత 8వ నెల వరకు టీకాలు వేయిస్తే మిగిలిన రూ.3వేలు.. ఇలా నాలుగు విడుతలుగా కేసీఆర్ కిట్, డబ్బులు అందేవి. ప్రసవం తర్వాత కిట్‌తో పాటు మగ శిశువు జన్మిస్తే రూ.12 వేలు, ఆడ శిశువు జన్మిస్తే రూ.13వేలు అందించేవారు. డెలివరీ తర్వాత తల్లీ బిడ్డను 102 వాహనంలో తీసుకెళ్లి వారి వారి ఇండ్ల వద్ద వదిలిపెట్టేవారు. కానీ రేవంత్ పాలనలో కిట్లు బంద్ అయ్యాయి.



బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కిట్ అందుకొని సంబురపడుతున్న తల్లీబిడ్డ (ఫైల్)

**పేరు మార్చినా.. అందించని వైనం**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నాటికి స్టాక్‌లో ఉన్న కిట్లపై కేసీఆర్ ఫొటో ఉంటే.. వాటిపై స్టిక్కర్ అతికించి.. కేసీఆర్ కిట్ పేరుకు బదులు మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) పేరుతో అందించారు. అవి అయిపోయాక కొత్త కిట్ల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇప్పటికీ గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో గర్భిణుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఆశ వర్కర్లు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నప్పటికీ కిట్లు కానీ, డబ్బులు కానీ అందడం లేదు. అవేమీ ఇవ్వకుంటే బ్యాంక్ వివరాలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే, సాఫ్ట్‌వేర్ అలాగే ఉందని ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు సమాధానమిస్తున్నారు.

*నాడు సూపర్ హిట్ అయిన కేసీఆర్ కిట్..*

*నేడు ఫట్ అయ్యింది. సర్కారు దవాఖానల్లో ప్రసవాలు జరుగుతున్నా ఒక్కరికీ కూడా అందడం లేదు. కిట్ల సరఫరా వైపు ప్రభుత్వం కన్నెత్తి చూడడం లేదు. దీంతో నాడు ఎంతో ఆదరణ పొందిన పథకం నేడు అటకెక్కింది. కిట్లలోని 16 వస్తువులు అందక.. డబ్బులు జమగాక.. డెలీవరి అయిన మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో కాంగ్రెస్ 15 నెలల పాలనలో 4,830 ప్రసవాలు జరగగా.. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కిట్ అందలేదన్న ఆరోపణలు ఉన్నాయి.*

*– నారాయణపేట, మే 26*

- నాడు ఆదరణ.. నేడు నిరాదరణ
- సరఫరాపై కన్నెత్తి చూడని సర్కారు
- పేరు మారినా ఎంసీహెచ్ కిట్లేవి?
- దవాఖానల్లో నిలిచిన పంపిణీ
- పేట జిల్లాలో బాలింతల ఎదురుచూపు
- గతంలో డెలివరీ రోజే పంపిణీ

**కాంగ్రెస్ 15 నెలల పాలనలో పంపిణీ చేయని కిట్లు**

నారాయణపేట జిల్లా పరిధిలోని ప్రభుత్వ దవాఖానల్లో 2017 మే నుంచి 2024 జనవరి వరకు 22,408 ప్రసవాలు జరిగాయి. ఇందులో 15,494 సాధారణ, 6,914 సిజేరియన్ ప్రసవాలు జరిగాయి. మొత్తం 15,815 మందికి కేసీఆర్ కిట్లను, అదేవిధంగా బాలింతలకు నగదును అందజేశారు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి వరకు స్టాక్‌లో ఉన్న కేసీఆర్ కిట్లకు స్టిక్కర్లు అతికించి ఎంసీహెచ్ పేరుతో మార్చేసి వాటినే 2024 జనవరి వరకు అందజేశారు. ఇక అప్పటి నుంచి నేటి వరకు రేవంత్ ప్రభుత్వం ఒక్క కిట్ కూడా అందించలేదు. 2024 ఫిబ్రవరి నుంచి 2025 ఏప్రిల్ వరకు దవాఖానలో మొత్తం 4,830 ప్రసవాలు జరిగాయి. ఇందులో 2,882 సాధారణ ప్రసవాలు, 1,948 సిజేరియన్లు చేశారు. కానీ వీరిలో ఏ ఒక్కరికీ ఎంసీహెచ్ కిట్టు కానీ, నగదు కానీ అందించిన దాఖలాల్లేవు.

**కిట్ లేదు.. డబ్బుల్లేవు**



నాకు బిడ్డ, కొడుకు పుట్టారు. రెండు ప్రసవాలు ప్రభుత్వ దవాఖానలోనే జరిగాయి. బిడ్డ పుట్టిన తర్వాత ఏడాదికి రూ. 5వేలు వచ్చాయి. ఇప్పుడు బాబు పుట్టాడు. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి రాలేదు. మా లాంటి పేదలకు ఈ డబ్బులు ఉపయోగపడుతాయని ఆశ. బాబుకు రావాల్సిన రూ.12వేలతో పాటు కేసీఆర్ కిట్ అందజేస్తే అవసరాలకు ఉపయోగపడుతాయి.

**- అక్షిత, ధన్వాడ మండలం, నారాయణపేట జిల్లా**

**కేసీఆర్ కిట్‌ను కొనసాగించాలి**



గత ప్రభుత్వం అమలు చేస్తూ వచ్చిన కేసీఆర్ కిట్ వంటి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలి. రాజకీయాల కోసం ప్రజలకు ఎంతో మేలు చేసే పథకాలను నిలిపివేయడం వల్ల ప్రజలు నష్టపోతారు. కేసీఆర్ ప్రభుత్వంలో విజయవంతంగా అమలైన పథకాల్లో కేసీఆర్ కిట్ పథకం కూడా ఒకటి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అమలు చేయాలి.

**- సానియాబేగం, నారాయణపేట జిల్లా**

# గులాబీ దండు కదిలింది

- గద్వాల టు హైదరాబాద్‌కు బీఆర్ఎస్ శ్రేణులు
- 100 వాహనాల్లో తరలివెళ్లిన 800 మంది
- కేటీఆర్ సమక్షంలో గులాబీ గూటికి పలువురు
- తెలంగాణలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలి
- బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ నేత హనుమంతు నాయుడు



గద్వాలలో బీఆర్ఎస్ శ్రేణులతో ర్యాలీగా వెళ్తున్న హనుమంతు

గద్వాల, మే 26 : గద్వాల నుంచి హైదరాబాద్‌కు గులాబీ దండు కదిలింది. తెలంగాణ భవన్‌లో సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరేందుకు 50 మంది కాంగ్రెస్, బీజేపీకి చెందిన మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు తరలివెళ్లారు. పార్టీ గద్వాల నియోజకవర్గ నేత బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో సుమారు 100 వాహనాల్లో 800 మంది శ్రేణులు రాజధానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గద్వాల నోబుల్ స్కూల్ నుంచి వాహన ర్యాలీ ప్రారంభమై గాంధీ చౌక్ మీదుగా కృష్ణవేణి చౌక్‌కు చేరింది. అక్కడ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణవేణి చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో బాసు హనుమంతునాయుడు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రానికి బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అన్నారు. ఎన్నికల ముందు అనేక అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు అమలు కానీ హామీ ఇచ్చి మోసం చేశారని, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా అందించకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు.

అనంతరం భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కాగా కేటీదొడ్డి మాజీ ఎంపీపీ మనోరమ, ఆమె కుమారుడు చక్రధర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రఘురెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యువజన నాయకుడు చక్రధర్‌రెడ్డి తదితరులు తమ అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాసుశ్యామల, అంగడి బస్వరాజ్, శ్రీరాములు, మోనేశ్, రాజు, తిరుమల్, శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గద్వాల జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ వాహనశ్రేణి

# ధాన్యం కొనాలని.. రోడ్డు దిగ్బంధం

- శేరిపల్లె వద్ద కర్షకుల రాస్తారోకో
- పెబ్బేరు-కొల్లాపూర్ రోడ్డుపై బైఠాయింపు
- పురుగు మందు డబ్బాలతో అన్నదాతల నిరసన



శేరిపల్లె వద్ద కొల్లాపూర్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

పెబ్బేరు, మే 26 : అన్నదాతల ఆవేదన కాంగ్రెస్ ప్రభుత్వం చెవికెక్కడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రోజుల తరబడి వేచి చూడాల్సిన దైన్యస్థితి నెలకొన్నది. దీనికి తోడు అకాల వర్షాల కారణంగా కుప్పల్లోనే ధాన్యం మొలకలు వస్తుంటే రైతు గుండె తట్టుకోలేక పోతోంది. ఈ నేపథ్యంలోనే శ్రీరంగాపురం మండలం శేరిపల్లె రైతులు కన్నెర్ర చేశారు. సోమవారం గ్రామ సమీపంలోని కొల్లాపూర్ ప్రధాన రహదారిని దిగ్బంధించి రాస్తారోకో చేశారు. గంట పాటు సాగిన ఈ నిరసనకు చుట్టుపక్కల గ్రామాల రైతులు సైతం మద్దతుగా నిలిచారు. పార్టీలకతీతంగా సాగిన ఈ ఆందోళనలో రైతులు తాము పడుతున్న కష్టాలను కన్నీళ్ల ద్వారా తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని వారు వాపోయారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కేంద్రాల్లోనే వడ్లు మొలకెత్తుతున్నట్లు చెప్పారు. ఒక వేళ తూకం వేసినా మిల్లర్లు తరుగు పేరుతో తమను వేధిస్తున్నారని వారు ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎత్తేందుకు సకాలంలో లారీలు రాకపోవడంతో కళ్లల్లో వత్తులు పెట్టుకొని ధాన్యం కుప్పలకు కాపలా కాయాల్సి వస్తోందని వారు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఒడిదుడుకులకు లోనై పండించిన పంటను అమ్ముకొనేందుకు కూడా ఇన్ని కష్టాలు పడాల్సి రావడం శోచనీయమని వారు వాపోయారు. ప్రభుత్వం స్పందించకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని, పురుగుల మందు డబ్బాలు చేతబట్టి కొందరు రైతులు హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేదాకా ఆందోళన విరమించబోమని వారు భీష్మించుకూర్చోవడంతో శ్రీరంగాపురం, పెబ్బేరు మండలాల నుంచి పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మరో పక్క రాస్తారోకో కారణంగా రోడ్డుపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చివరికి శ్రీరంగాపురం తాసీల్దారు రాజు వచ్చి సకాలంలో ధాన్యం కొనేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# రైతన్న వరిగోస

- ధాన్యం కొనుగోళ్లల్లో తీవ్ర జాప్యం
- రోజుల తరబడి వేచిచూడాల్సిన దైన్యం
- కొల్లాపూర్ మార్కెట్‌లో తడిసిన ధాన్యం
- ఆందోళన చెందుతున్న రైతులు



తడిసిన ధాన్యాన్ని దగ్గరకు పోస్తున్న మహిళా రైతు

కొల్లాపూర్ రూరల్, మే 26 : కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు వరిగోస పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కన్న కష్టాలు పడుతున్నారు. కొల్లాపూర్ మార్కెట్ యార్డులో కొన్ని రోజుల నుంచి వడ్లు ఆరబెట్టుకోవడానికి స్థలాలు లేకపోవడంతో చాలా వరకు ధాన్యం అంతా పొలాల్లోనే ఉండిపోయింది. గత వారం పది రోజుల నుంచి రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువచ్చినా మార్కెట్ అధికారులు కాంటా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేది లేక ప్రతిరోజూ రైతులు ధాన్యం ఆరబెట్టడం, కుప్పలు కట్టడం తోనే సరిపోయింది. ఈ క్రమంలో ఆదివారం కురిసిన వర్షానికి మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం అంతా తడిసి ముద్దయింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేయకుండా కాలయాపన చేయడంతో మార్కెట్‌కు వచ్చిన ధాన్యం అంతా తడిముద్దయ్యిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నో కష్టాలు పడి పంటలు పండించి చేతికి వచ్చిన పంటలను అమ్ముకోవాలంటే కూడా ఎన్నో కష్టాలు పడే పరిస్థితికి వచ్చిందని వాపోతున్నారు. ఎప్పటికప్పుడు రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లుచేపట్టి ఉంటే ధాన్యం తడిసి ఉండేది కాదని, రైతులం ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది కాదని, తడిసిన ధాన్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించి తడిచిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయాధికారులు ముందుగా పంటలు సాగు చేసే సమయంలో తగిన సలహాలు, సూచనలు చేసి రైతులను చైతన్యం చేయడంతో విఫలమయ్యారని, అందుకే రైతులు పంటల సాగులో వెనుకబడి పోయి నేడు అకాల వర్షాలతో ధాన్యం కాపాడుకోవడం కష్టతరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సాగులోనైనా వ్యవసాయాధికారులు రైతులకు పంటల సాగుపై సరైన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కొల్లాపూర్ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని దగ్గరకు చేస్తున్న రైతులు

## భూ భారతి చట్టంతో సమస్యను పరిష్కరించాలి

- మద్దూరు తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మద్దూర్, మే 26 : భూ సమస్యలను పరిష్కరించాలంటూ మద్దూర్ మున్సిపాలిటీలోని రెణివట్ల రైతులు మద్దూర్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో మా భూమి సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. 319, 320, 359, 360, 210, 564, 565 సర్వే నెంబర్లలోని 66 ఎకరాల 11 గుంటల భూమిలో 13 మంది రైతులు 50 ఏండ్లుగా కాస్తులో ఉన్నారు. అయితే ఈ భూమికి ఓఆర్సీ సర్టిఫికెట్ అందజేసి నాలుగు సమాన భాగాలుగా చేసి ఇవ్వాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కొత్త చట్టంతో తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తెలుసుకొన్న తాసీల్దార్ మహేశ్‌గౌడ్ అక్కడకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో రైతులు శాంతించారు.


# తడిసి మొలకెత్తిన ధాన్యం

- అవస్థలు పడుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

వీపనగండ్ల, మే 26 : యాసంగిలో పండించిన ధాన్యాన్ని రెండు నెలలు అవుతున్నా కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. దీంతో రైతులు కొన్ని రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే ఉంచుకొని పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన సౌకర్యాలు లేకపోవడం, కనీసం ధాన్యం తడవకుండా ఉండేందుకు కవర్లు కూడా ఇవ్వకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం మొత్తం తడిసి మొలకెత్తుతుండడంతో అన్నదాతలకు ఆందోళనకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళికలకు లేకపోవడం వల్లే కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, కవర్ల కొరత, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరత ఏర్పడడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ధాన్యానికి సరిపడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచి పోయింది. దీంతో చేసేదేమీలేక రైతులు గత కొద్ది రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో స్పందించిన అదనపు కలెక్టర్ మండల కేంద్రం సమీపంలోని మార్కెట్ యార్డు గోదాముకు ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయినా కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి ధాన్యాన్ని పెట్టుకొని వేచి ఉండడం ఇబ్బందికరంగా మారడంతో రైతులే నేరుగా ధాన్యాన్ని బస్తాలకు నింపుకొని ట్రాక్టర్లలో గోదాముకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో గోదాము వద్ద కూడా భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. ఇదే అదునుగా భావించిన మిల్లులు తేమ శాతం పేరుతో క్వింటాకు రెండు నుంచి మూడు కిలోల తరుగు తీస్తుండడం రైతులను మరింత వేదనకు గురిచేస్తున్నది. ఏది ఏమైనా గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల వద్దకే నేరుగా వెళ్లి ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కొనుగోళ్ల విషయం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది.



కొనుగోలు చేయకపోవడంతో కల్లాల్లో అకాల వర్షాలకు తడిసి మొలకెత్తిన ధాన్యం



మొలకెత్తిన ధాన్యం




వీపనగండ్ల సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద బారులు తీరిన వాహనాలు